## కొత్త సంవత్సరము (శ్రీ ఖర) విశేషము!



ముఖచిత్రము చూడగానే మీకేమైనా విశేషము కనిపించిందా? జాగ్రత్తగా గమనిస్తే మబ్బులు ఒక తల ఆకారాన్ని ఏర్పరుస్తున్నాయి. "తల ఆకారము ఏర్పడితే ఏమిటి వింత?" అని అడగాలనుకుంటున్నారా? క్రింద చదవండి, మీకే తెలుస్తుంది.

ముందుగా మీకందరికి తెలుగు, కన్నడ, మరాఠీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. తమిళ సోదర సోదరీమణులకు కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఇది ప్రతి సంవత్సరములాగునే మరొక సంవత్సరము. ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి. ఎన్నో ఏళ్ళు రానున్నాయి. ఇది నిరంతర ప్రయాణం. మబ్బులతో ఏర్పడిన చిత్రము కాలపురుషునిది.

ప్రతి క్షణము అతి విలువైనది. కాలము చాలా విషయములపై నియంత్రణ కలిగి ఉంటుంది. ఉదాహరణకి ఒక కోడిగుడ్డు నుండి కోడి పిల్ల బయటపడడానికి 21 రోజుల సమయం కావాలి. నవమాసములు మోస్తేగాని తల్లి సంతానమును పొందలేదు. చెట్లు వసంతములో ఆకుపచ్చ వస్త్రములు ధరించి, కాలానుగుణంగా పుష్పములను, ఫలములను అందిస్తాయి. కొన్ని ఫలములు సంవత్సరము పొడుగునా లభిస్తాయి. అదే ప్రకృతి. [క్షమించండి. ఈ రోజులలో మనము ప్రకృతికి విరుద్ధముగా - ఒక ఋతుకాలములో దొరికే ఫలములను సంవత్సరము పొడుగునా దొరికే విధముగా విశ్వామిత్ర సృష్టిని అనుసరిస్తున్నాము. ఉదహరణకి మామిడి వసంత ఋతువు మొదలుకొని గ్రీష్మ ఋతువు చివరి వరకు దొరకుతాయి. కాని నేడు మనకు సంవత్సరము పొడుగునా దొరకుతున్నాయి]. మనకు కాలముమీద ఎలాంటి నియంత్రణాలేదు. మనకందరకు తెలిసిన విషయము "నిన్న తిరిగి రానిది. రేపు జనియించనిది. నేడు ఒక బహుమతి". కాలపురుషుడు కాలాన్ని మింగేస్తాడని - రోజులు, సంవత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాలు ఎన్ని గతించాయో ఎవరికి ఎరుక. కాని, కాలపురుషుడే అన్నిటికి సాక్షి. మనము నిరంతరము ప్రయాణిస్తూనే ఉన్నాము. మనము విశ్రమించినా, కాలము మనకోసం ఆగదు.

కాలము మనలో కూడా మార్పుతెస్తుంది. మన జీవితములో కూడా ఋతువులున్నాయి. వాటినే మనము బాల్యము, యౌవనము, కౌమారము, వృద్ధాప్యము అనే పేర్లతో పిలుస్తున్నాము. చెట్లు, మొక్కలు వసంతములో చిగురించునట్లే, మనమూ బాల్యములో పెరగడం జరుగుతుంది. రెండవ దశలో మనము శరీరధారుఢ్యమును పెంచుకోవడం జరుగుతుంది. మూడవదశలో మొక్కలు ఫలములను, పుష్పములను అందిస్తే - మనకు ధనార్జన, సంతాన పోషణము మొదలైన బాధ్యతలు ఏర్పడతాయి. చివరి దశలో చెట్లు ఆకులను రాల్చి, మోడుగా మిగులుతాయి - మానవుల విషయములో శరీరము కృశించి, శక్తి క్షీణించి, శరీరము కాంతి విహీనమౌతుంది. చివరి దశలో చెట్టు మోడుగా కనిపించినా అందులో జీవం ఉంటుంది. మానవులలో కూడా ఆత్మ నాశనములేనిది. మళ్ళీ వసంతము వచ్చినపుడు చెట్లు చిగురించినట్లే, ఆత్మ మరొక రూపాన్ని సంతరించుకుంటుంది.

నిశితముగా పరిశీలిస్తే ప్రకృతి మనకు ఎన్నో విలువైన పాఠములను నేర్పుతుంది. మనకు వినే ఓపిక ఉండాలి. ఒక నది తన ప్రయాణము పూలబాటకాదని, అయినా దానిని అనుక్షణం అనందిస్తానని ఉరకలేస్తూ చెప్తుంది. దాని ప్రయాణములో ఎన్నో మలుపులను తీసుకుంటుంది, కని ప్రయాణము ఆపదు. మనము కూడా మన ప్రయాణాన్ని దైవశక్తిమీద నమ్మకముతోను, అన్నీ సక్రమముగా జరుగుతాయనే విశ్వాసముతోను సాగిద్దాం! మన ప్రయాణములో ప్రతిక్షణాన్ని ఆస్వాదిద్దాం! గతము గురించి ఎక్కువ చింతించ వద్దు. భవిష్యత్తు గురించి కలలు కనడమూ తగ్గిద్దాం! ఈ విధముగా చేయడం వలన మనము ప్రస్తుతముమీద దృష్టి సారించవచ్చు, తత్కారణముగా నాణ్యమైన జీవితాన్ని గడపవచ్చు. మీ సలహాలు, సూచనలు పంపడానికి సంకోచించనవసరము లేదు.

మళ్ళీ జులై సంచికలో కలుద్దాం! **- సుశ్రీ.**